కుక్కల దాడిలో బాలికకు గాయాలు




గాయపడిన రిషిక

చిన్నశంకరంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో బాలికకు తీవ్రగాయాలైన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని మడూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాగగోని భూమాగౌడ్ కుమార్తె రిషిక (9) ఆదివారం సెలవు కావడంతో ఇంటి వద్ద ఆడుకుంటున్నది. అదే సమయంలో వీధి కుక్కలు గుంపుగా వచ్చి ఒక్కసారిగా బాలికపై దాడిచేశాయి. బాలిక ముఖానికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో వీధికుక్కల బెడద తీవ్రంగా ఉందని, గతంలోనూ పలువురిపై దాడి చేసి గాయపర్చాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పులుల సంఖ్య లెక్కింపునకు స్వచ్ఛంద సేవకులకు ఆహ్వానం

సంగారెడ్డి జిల్లా అటవీ శాఖాధికారి శ్రీధర్‌రావు

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా నవంబర్ 20 నుంచి 26 వరకు నిర్వహించనున్న ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేట్ కార్యక్రమం విజయవంతంగా జరిగేందుకు స్వచ్ఛంద సేవకులు ముందుకు రావాలని జిల్లా అటవీ అధికారి శ్రీధర్ రావు ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమం దేశంలోని అన్ని అటవీ బీట్‌లలో ఒకేసారి నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి బీట్‌కు ముగ్గురు సభ్యులతో కూడిన బృందం అవసరమని అన్నారు. అటవీ సిబ్బంది పరిమితంగా ఉండటంతో, స్థానిక పట్టభద్రులు, డిగ్రీ/పీజీ విద్యార్థులు స్వచ్ఛంద సేవకులుగా ముందుకురావాలని కోరారు. స్వచ్ఛంద సేవకులు ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ కలిగి ఉండాలని, సంబంధిత ప్రాంతానికి చెందిన స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొనదలచిన వారికి ప్రాథమిక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 27 సంగారెడ్డిలో ఫీల్డ్ స్థాయి సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు తమ వివరాలను సంగారెడ్డి మల్కాపూర్ చౌరస్తా సమీపంలో జిల్లా అటవీ అధికారి కార్యాలయంలో వ్యక్తిగతంగా హాజరై నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇలా నమోదు చేసుకున్నవారిలో ఎంపిక చేసిన వారికి త్వరలో శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు.



వైద్య శాఖలో పైసా వసూల్

డిప్యూటేషన్‌కు రూ.లక్ష..
విధులకు రాకుంటే ప్రతి నెలా రూ.60 వేలు!

జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న ఓ ఈఎన్‌టీ డాక్టర్ విధులకు సక్రమంగా హాజరుకాకపోయినా ప్రతి నెలా మొత్తం జీతం తీసుకుంటారు. ఇందుకు కారణం ప్రతి నెలా ఆ డాక్టర్‌కు వచ్చే జీతంలో కొంత మొత్తాన్ని టీవీవీపీ జిల్లా అధికారులకు ముట్టజెబుతారని ప్రచారం. రెండేళ్లుగా ఈ వ్యవహారం కొనసాగుతున్నది. తాజాగా ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ విధానం అమలులోకి రావడంతో సదరు డాక్టర్‌కు ఎఫ్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఇటీవల జహీరాబాద్ ఆస్పత్రికి రావాల్సి వచ్చింది. ఎఫ్ఆర్ఎస్ అమలులోకి వస్తే సదరు డాక్టర్ నిత్యం విధులకు హాజరుకావాల్సి ఉంటుంది. అది తన వల్ల కాదని వీఆర్ఎస్ తీసుకోవాలని నిర్ణయించుకొని టీవీవీపీ జిల్లా అధికారులను సంప్రదించారు. వీఆర్ఎస్ ఎందుకు.. తాము చూసుకుంటామని చెప్పిన అధికారులు కోహీర్ సీహెచ్‌సీకి డిప్యూటేషన్‌పై పంపిస్తే ఎఫ్ఆర్ఎస్ ప్రభావం ఉండదని సూచించారు. కోహీర్‌కు డిప్యూటేషన్‌పై పంపించేందుకు బేరం కుదుర్చుకున్నారు. ఇందుకు డిప్యూటేషన్‌కు రూ.లక్ష చెల్లించాలని, విధులకు రాకున్నా జీతం ఇవ్వడం కోసం ప్రతి నెలా రూ.60 వేలు ఇవ్వాలని మరో డాక్టర్ సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు. ఈ తతంగానికి సంబంధించిన ఆడియో, వీడియో సంభాషణలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. సంగారెడ్డి జిల్లాలో టీవీవీపీ పరిధిలోని పలు ఆస్పత్రుల్లో ఇలా విధులకు రాకున్నా చూసీచూడనట్లు సర్దుకుపోయేందుకు పలువురు సిబ్బంది, డాక్టర్లతో అధికారులు ఒప్పందాలు చేసుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రి నుంచి ఓ సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌ను గత నెల సదాశివపేట సీహెచ్‌సీకి డిప్యూటేషన్‌పై పంపించడం, మరో కాంట్రాక్టు డాక్టర్ ఆర్డర్ రెన్యూవల్ కోసం టీవీవీపీ కార్యాలయ సిబ్బంది రూ. లక్షలు డిమాండ్ చేసినట్టు తెలిసింది. పని చేసిపెట్టిన అనంతరం ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్నవారు ఆ నగదును పంచుకున్నట్టు సమాచారం. ఈ మొత్తం ఒప్పందంలో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు కీలకంగా వ్యవహరించినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే డబ్బుల పంపకాల్లో తేడా రావడంతో ఈ వ్యవహారం మొత్తం బయటపడింది. అయినా ఉన్నతాధికారులు ఇప్పటి వరకు స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇటీవల జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి నుంచి ఓ మిడ్‌వైఫ్ నర్సును కంప్లైంట్ వచ్చిందని చెప్పి బలవంతంగా సదాశివపేటకు డిప్యూటేషన్‌పై పంపించారు. తాను ఏ తప్పు చేయలేదని తేల్చిచెప్పిన సదరు నర్సు సదాశివపేటకు వెళ్లకుండా సంబంధిత అధికారులతో వాగ్వాదానికి దిగింది. దీంతో, వెనక్కి తగ్గిన అధికారులు తిరిగి ఆమెను పాత స్థానంలోనే పనిచేయాలని శనివారం ఆదేశాలు జారీ చేశారు.

- డాక్టర్‌తో టీవీవీపీ అధికారుల ఒప్పందం
- సామాజిక మాధ్యమాల్లో ఆడియో వైరల్
- అడ్డగోలుగా డాక్టర్లు, నర్సులు, ఉద్యోగుల డిప్యూటేషన్లు
- ఆర్డర్ పంపి.. వెంటనే జాయిన్ కావాలని ఒత్తిడి
- దందాలో ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు ఉద్యోగుల ప్రమేయం
- జిల్లా అధికారి తీరుతో టీవీవీపీ ఉద్యోగులకు ఇబ్బందులు
- ఒకట్రెండు రోజుల్లో మంత్రి, కలెక్టర్ వద్దకు పంచాయితీ!

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని సంగారెడ్డి జిల్లా అధికారులు ఇటీవల బలవంతపు డిప్యూటేషన్ల పర్వానికి తెరలేపారు. నెలన్నర వ్యవధిలో పదుల సంఖ్యలో డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, మినిస్టీరియల్, నాలుగో తరగతి ఉద్యోగులకు స్థానచలనం కల్పించారు. ఈ వ్యవహారంలో పెద్దమొత్తంలో డబ్బు చేతులు మారినట్టు ఆరోపణలు వస్తున్నాయి. కొందరు డాక్టర్లు, నర్సులు, ఉద్యోగులను అవసరం లేనిచోటికి బలవంతంగా డిప్యూటేషన్‌పై పంపినట్లు పలువు ఆరోపిస్తున్నారు. ఆదేశాలు వచ్చిన వెంటనే కొత్త స్థానంలో చేరిపోవాలని ఒత్తిడి తెస్తున్నారని తెలుస్తున్నది. ఎవరైనా ప్రశ్నిస్తే.. 'మీ పై కాంప్లైంట్ వచ్చిందని చెప్తున్నారని, ఆ ఫిర్యాదు వివరాలు చెప్పమంటే మాత్రం కాన్ఫిడెన్షియల్ అంటూ సదరుశాఖ జిల్లా అధికారి జవాబిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి సంబంధించి ఓ వైద్యాధికారి, సంగారెడ్డి కేంద్రంగా పనిచేస్తున్న మరో డాక్టర్‌తో పాటు టీవీవీపీ జిల్లా కార్యాలయంలో ఒకరిద్దరు ఉద్యోగులు ఈ వ్యవహారం నడిపిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

మచ్చుకు కొన్ని డిప్యూటేషన్లు

సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ సీహెచ్‌సీ నుంచి ముగ్గురు డాక్టర్లను పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రికి డిప్యూటేషన్ ఇచ్చారు. ఇక జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి నుంచి ఓ డాక్టర్‌ను మిర్జాపూర్ సీహెచ్‌సీకి, మరో డాక్టర్‌ను పటాన్‌చెరు ఆస్పత్రికి, అదే విధంగా ఓ సీనియర్ అసిస్టెంట్‌ను జోగిపేటకు, మరో సీనియర్ అసిస్టెంట్‌ను సదాశివపేటకు, మరో జూనియర్ అసిస్టెంట్‌ను సీహెచ్‌సీ కోహీర్‌కు, ఓ హెడ్ నర్సును సదాశివపేటకు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. ఇక కరస్‌గుత్తి సీహెచ్‌సీ నుంచి ఐదుగురు స్టాఫ్ నర్సులకు మిర్జాపూర్‌కు డిప్యూటేషన్

మిగతా 8వ పేజీలో

కర్నూల్ బస్సు ప్రమాద మృతులకు
నేడు అంత్యక్రియలు

డీఎన్‌ఏ పరీక్షల అనంతరం మృతదేహాల అప్పగింత



సుధారాణి, చందన (ఫైల్)

మెదక్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాద దుర్ఘటనలో సజీవ దహనమైన తల్లీకూతుళ్ల మృతదేహాలను ఆదివారం సాయంత్రం అధికారులు బంధువులకు అప్పగించారు. హైదరాబాద్ నుంచి గురువారం సాయంత్రం బెంగళూరు బయల్దేరిని వేమూరి ట్రావెల్ స్లీపర్ కోచ్ టూరిస్టు బస్సు శుక్రవారం తెల్లవారుజామున కర్నూలు సమీపంలో ప్రమాదానికి దగ్ధం కావడంతో 19 మంది ప్రయాణికులు సజీవదహనమైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో జిల్లాలోని శివాయిపల్లికి చెందిన తల్లీకూతుళ్లు సుధారాణి, చందన కూడా మృతిచెందారు. ప్రమాదంలో మృతదేహాల ఆనవాళ్లు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. దీంతో, మృతదేహాలను గుర్తించడానికి డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించారు. మృతుల బంధువుల నుంచి డీఎన్‌ఏ శాంపిల్ సేకరించి ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరిలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ వేర్వేరుగా కర్నూల్‌లోని అధికారులతో ఫోన్‌లో సంప్రదించి సుధారాణి, చందనల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించాల్సిందిగా సూచించారు. ఆదివారం ఉదయం డీఎన్‌ఏ రిపోర్టు రావడంతో అధికారులు సుధారాణి భర్త ఆనంద్‌గౌడ్‌కు మృతదేహాలను అప్పగించారు. వారి స్వగ్రామమైన శివాయిపల్లిలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

మెదక్ జిల్లాలో
498 కొనుగోలు కేంద్రాలు : కలెక్టర్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మెదక్ మండల పరిధిలోని రాజ్‌పల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం, సబ్ స్టేషన్‌ను మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లాలో 498 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కేంద్రాలకు తీసుకువచ్చిన వడ్లలో తేమశాతం సరిగ్గా ఉన్నవాటికి టోకెన్ ఇస్తున్నామని చెప్పారు. కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం చేరవేసేందుకు సరిపడా వాహనాలు ఏర్పాటు చేశామని చెప్పారు. కొనుగోలు పూర్తయి వెంటనే బిల్లులు చెల్లించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రైతులు దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. అనంతరం సబ్‌స్టేషన్‌ను తనిఖీచేసి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందజేయాలని అధికారులకు సూచించారు.

లక్కు చిక్కేనా..

మద్యం దుకాణాలకు నేడే లాటరీ

- దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ
- సంగారెడ్డిలో 101, మెదక్‌లో 49 వైన్ షాపులు
- అందరి చూపు ఆ షాపుల పైనే..
- గుడ్‌విల్ తీసుకో.. షాప్ ఇచ్చేయ్
- ప్రలోభాలకు సిద్ధమవుతున్న మద్యం సిండికేట్

ఆబ్కారీ శాఖకు వచ్చిన దరఖాస్తులు

జిల్లా	దుకాణాలు	దరఖాస్తులు	ఆదాయం
సంగారెడ్డి	101	4432	రూ. 132.96కోట్లు
మెదక్	49	1420	రూ. 42.60కోట్లు

సంగారెడ్డి క్రైం/మెదక్ అర్బన్ అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ తుది అంకానికి చేరుకోవడంతో టెండర్‌దారుల్లో ఉత్కంఠ నెలకొంది. మరికొన్ని గంటల్లో లక్కీడ్రా తీయనుండగా.. లక్కు దక్కేనా.. దుకాణం చిక్కేనా.. అనే ఆందోళనలో పడ్డారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలో మద్యం దుకాణాలకు సోమవారం లక్కీడ్రా తీయనున్నారు. ఇందుకోసం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో 101, మెదక్ జిల్లాలో 49 మద్యం దుకాణాలకు గత నెల 26 నుంచి ఈ నెల 23 వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఒక్కో షాప్‌కు రూ.3లక్షల ఫీజు నిర్ణయించడంతో గతేడాదితో పోలిస్తే దరఖాస్తుల సంఖ్య తగ్గినప్పటికీ ఆదాయం మాత్రం పెరిగింది. సంగారెడ్డి జిల్లాలో 101 మద్యం దుకాణాలకు 4,432 దరఖాస్తులు రావడంతో ఫీజు రూపంలో రూ.132.96 కోట్ల ఆదాయం వచ్చింది. మెదక్ జిల్లాలో 49 దుకాణాలకు 1,420 దరఖాస్తులకు రూ.42.60కోట్ల ఆదాయం వచ్చింది.

పకడ్బందీ ఏర్పాట్లు

దుకాణాల లక్కీడ్రా కోసం సంగారెడ్డి జిల్లాకు సంబంధించి పోతిరెడ్డిపల్లి పరిధిలోని జేఎస్ఆర్ గార్డెన్‌లో, మెదక్ జిల్లాకు సంబంధించి పట్టణంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో ఆబ్కారీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 గంటల నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. దరఖాస్తు నంబర్లు, పేర్లతో పాటు మద్యం దుకాణాల గెజిట్ నంబర్ల ఆధారంగా లక్కీడ్రా ప్రక్రియ కొనసాగుతుంది. ఒక్కో దరఖాస్తుకు రూ.3లక్షలు ఫీజు చెల్లించారు. కొందరు సొంతగా దరఖాస్తు చేసుకోగా.. మరికొంతమంది ఇద్దరు, ముగ్గురు కలిసి ఫీజు కట్టారు. కొందరు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి 50 నుంచి 100 దరఖాస్తులు సమర్పించినట్లు తెలుస్తోంది. ఈ సిండికేట్‌లో నాలుగైదు దుకాణాలు వచ్చినా సంపాదించవచ్చని భావిస్తున్నారు.

అందరి చూపు.. ఆ షాపులవైపే

మద్యం టెండర్లలో అందరి చూపు కొన్ని షాపులపైనే ఉన్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని అమీన్‌పూర్, పటాన్‌చెరు, ఇస్నాపూర్, తెల్లాపూర్, రామచంద్రపురం ప్రాంతాల్లోని షాప్‌లకు అధిక డిమాండ్ ఉంది. తెల్లాపూర్‌లో షాప్ నంబర్-1కు 127, షాప్-2కు 120, షాప్-3కి 122, షాప్-4కు 113 దరఖాస్తులు సమర్పించారు. అమీన్‌పూర్ షాప్-2కు 111, షాప్-3కు 105, షాప్-4కు 113 దరఖాస్తులు వచ్చాయి. ఇస్నాపూర్‌లోని షాప్‌లకు కూడా భారీగా దరఖాస్తులు వచ్చాయి. అతి తక్కువగా పుల్కల్ షాప్‌కు 16, చౌటకూర్ షాపుకు 17, న్యాల్‌కల్ షాపుకు 18 అప్లికేషన్లు వచ్చాయి. మెదక్ జిల్లాలో అత్యధికంగా పోతంశెట్టిపల్లి(ఏడుపాయల) 54, జగ్గంపేట వైన్స్‌కు 48, శివ్వంపేట 47 దరఖాస్తులు వచ్చాయి.

సిండికేట్ మాయ

టెండర్ల ప్రక్రియలో సిండికేట్‌ల హవా కొనసాగినా సొంతగా దరఖాస్తు చేసుకున్నవారూ ఎక్కువగానే ఉన్నారు. ఇతర రంగాల్లో

మిగతా 8వ పేజీలో



పారదర్శకంగా ప్రక్రియ : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మద్యం దుకాణాల కేటాయింపు కోసం నిర్వహించే లక్కీడ్రా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. పట్టణంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో లక్కీడ్రాకు చేస్తున్న ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. జిల్లాలోని మెదక్ సర్కిల్‌లో 513, నర్సాపూర్ సర్కిల్‌లో 519, రామాయంపేట సర్కిల్‌లో 388 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నేడు ఉదయం 11 గంటలకు దరఖాస్తు చేసుకున్నవారిలో లాటరీ పద్ధతిలో ఎంపికచేసిన వారికి మద్యం లైసెన్సులను కేటాయిస్తామన్నారు. టెండర్‌దారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

హైవే44పై రోజంతా ట్రాఫిక్ జామ్

లారీ పైనుంచి పడిపోయిన భారీ స్టీల్ రోలర్

తూప్రాన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంతో హైవే44పై రోజంతా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. కామారెడ్డి వైపు నుంచి హైద్రాబాద్‌కు లారీపై తీసుకువస్తున్న 30 టన్నుల బరువైన స్టీల్ షీట్ రోలర్‌ను లారీపై తీసుకువస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున తూప్రాన్ పరిధిలోని నాగులపల్లి బ్రిడ్జిపై ఈ లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టడంతో స్టీల్ షీట్స్ రోలర్ కింద పడిపోయింది. దీంతో, ట్రాఫిక్‌ను సర్వీస్ రోడ్డు మీదుగా మళ్లించడంతో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం ఏర్పడింది. రాత్రి 8 గంటలకు భారీ క్రేన్‌ను రప్పించి రోలర్‌ను తొలగించడంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యింది.



భార్య కాపురానికి రావడంలేదని..
వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

సిద్దిపేట క్రైం/గజ్వేల్ రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటనలు శనివారం సిద్దిపేట జిల్లాలో రెండు చోట్ల చోటుచేసుకున్నాయి. సిద్దిపేట భారత్‌నగర్‌లో ఒకరు పురుగుల మందు తాగి, గజ్వేల్ మండలం రిమ్మనగూడలో మరొకరు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు.

సిద్దిపేటలో..


యాదగిరి (ఫైల్)

కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణానికి చెందిన యాదగిరి(40)కి కొంతకాలంగా భార్యతో విభేదాలు ఉన్నాయి. భార్య కాపురానికి రాకపోవడంతో పాటు, బిడ్డను కూడా చూపించకపోవడంతో యాదగిరి తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. బిడ్డను చూడటానికి యాదగిరి భార్య వద్దకు వెళ్లాడు. అక్కడ భార్యతో పాటు ఆమె కుటుంబసభ్యులు, అక్క, చిన్నాన్న కొడుకు దురుసుగా ప్రవర్తించి బెదిరించారు. దీంతో మరింత మనోవేదనకు గురయ్యాడు. శనివారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. యాదగిరి మృతికి భార్య, ఆమె బంధువులే కారణమని ఆరోపిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రిమ్మనగూడలో..


ఎన్నెల్లి కిషన్ (ఫైల్)

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మండలం రిమన్నగూడ గ్రామానికి చెందిన ఎన్నెల్లి కిషన్(32)కు మండలంలోని దాచారం గ్రామానికి చెందిన మమతతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతుల మధ్య మనస్పర్థలు వచ్చి గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. నాటి నుంచి కిషన్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.

కారు, బస్సు ఢీ..
ఇద్దరికి గాయాలు


గాయపడిన స్వప్న, శంకర్

రాయపోల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కారు, ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడిన సంఘటన రాయపోల్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... కామారెడ్డి ప్రాంతానికి చెందిన శంకర్ కుటుంబసభ్యులతో కలిసి కారులో గజ్వేల్ ప్రాంతంలో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. వారు తిరిగి రామాయంపేట వైపు వెళ్తున్న క్రమంలో రాయపోల్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న మూలమలుపు వద్ద రామాయంపేట నుంచి గజ్వేల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న శంకర్, స్వప్నకు గాయాలయ్యాయి. రాయపోల్ ఎస్ఐ మానస సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు సేకరించారు. ఇదిలా ఉండగా రాయపోల్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న మూలమలుపు వద్ద తరచూ ప్రమాదాల చోటు చేసుకుంటున్నాయి. ఈ మలుపు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి, ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సంగారెడ్డిలో భారీ చోరీ

- 30 తులాల బంగారం, రూ.25లక్షల నగదు అపహరణ

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలో ఆదివారం భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి అయిన రాములు పట్టణంలోని వసంత్‌నగర్ కాలనీలో నివాసముంటున్నాడు. శనివారం నాడు రాత్రి రాములు తన కుటుంబసభ్యులతో కలిసి నారాయణఖేడ్‌కు వెళ్లాడు. మరుసటి రోజు ఆదివారం సాయంత్రం తిరిగి సంగారెడ్డికి వచ్చాడు. రాగానే ఇంటి తాళం పగులగొట్టి ఉండగా లోపల బీరువాలో వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా పట్టణ ఎస్ఐ నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసు జాగిలాలతో దర్యాప్తు జరిపారు. బీరువాలో ఉంచిన 30 తులాల బంగారం, రూ.25లక్షల 75వేల నగదును దొంగలు అపహరించినట్లు బాధితుడు రాములు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల తాను ప్లాట్ విక్రయించగా వచ్చిన డబ్బుతో బంగారం కొనుగోలు చేయగా, మిగతా నగదును బీరువాలో దాచి పెట్టినట్టు రాములు తెలిపారు. అయితే రాములు ఇంటి పరిసరాల్లో నాలుగు సీసీ కెమెరాలు ఉండగా ఒక్క కెమెరా పనిచేయకపోవడం గమనార్హం.


ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

పెయింటింగ్ పనులు చేస్తుండగా..
విద్యుదాఘాతంతో ఒకరి మృతి


సతీష్‌గౌడ్(ఫైల్)

తూప్రాన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెయింటింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ వైరు తగిలి కరెంటు షాక్‌తో ఒకరి మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన తీగల సతీష్‌గౌడ్(40) పెయింటింగ్ పనులు చేసేందుకు తూప్రాన్ వచ్చాడు. తూప్రాన్ పట్టణంలో ఓ భవనానికి రూలర్ సహాయంతో పెయింటింగ్ వేస్తుండగా, రూలర్ కరెంట్ వైర్లకు తగిలడంతో సతీష్‌గౌడ్‌కు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. తూప్రాన్ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైనా చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ మేరకు తూప్రాన్ పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం తాగిన వ్యక్తి..


వెంకటేశం(ఫైల్)

చిన్నశంకరంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అతిగా మద్యం తాగి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబాజీపేట గ్రామానికి చెందిన బండారు వెంకటేశం(32) గవ్వలపల్లి ఎక్స్‌రోడ్డు వైన్స్‌షాప్ పర్మిట్‌రూంలో అతిగా మద్యం తాగి కిందపడి మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు పిల్లలు సాయిపల్లవి, అభినయ్ ఉన్నారు. మృతుడు వెంకటేశం ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హల్దీ వాగులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

చిన్నశంకరంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని ధర్పల్లి గ్రామ శివారు హల్దీ వాగులో గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం ఆదివారం వాగులో మృతదేహం తేలియాడుతుండం చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు స్థానికుల సహాయంతో నీటిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలి వయస్సు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండవచ్చని తెలిపారు. ఎక్కడి నుంచో వచ్చి ఆత్మహత్య చేసుకుందా లేదా అదృశ్యమై వాగులో పడి మృతిచెందిందా అని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరి అదృశ్యం

పటాన్‌చెరు అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు అదృశ్యమైన కేసులు ఆదివారం నమోదయ్యాయి. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్న మోహన్ ట్రాలీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 24వ తేదీ ఉదయం 9 గంటల సమయంలో ఇంటి నుంచి ఆటోతో వెళ్లి, తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్చాప్ అయింది. కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో భార్య పల్లవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మరో కేసులో.. పటాన్‌చెరు శ్రీరామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న బాల్‌రెడ్డి వెల్జాన్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. 24వ తేదీన సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి వచ్చారు. బయటకు వెళ్లి వస్తానని చెప్పిన బాల్‌రెడ్డి తిరిగి రాలేదు. భార్య సమత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


మోహన్


బాల్‌రెడ్డి

పేకాట స్థావరాలపై దాడులు

- జహీరాబాద్, కొండాపూర్‌లో 35 మంది అరెస్ట్

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో, మెదక్ జిల్లా రేగోడు మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిబ్బంది దాడి చేసి 35 మందిపి అదుపులోకి తీసుకుని, నగదు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

కొండాపూర్ శివారులో 19 మంది అరెస్ట్

రేగోడు అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో ఓషెడ్డులో పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు దాడులు చేసినట్లు అల్లాదుర్గం సీఐ రేణుక ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు చెందిన నందు, లావ్య, రోహిత్ హైదరాబాద్, పటాన్‌చెరు శంకర్‌పల్లి, జనవాడ, చేవెళ్ల, అల్వాల్ ప్రాంతంలో నివసిస్తున్న కొందరు యువకులను పేకాట ఆడిస్తున్నట్లు తెలిపారు. శనివారం రాత్రి పోలీస్ సిబ్బందితో కలసి దాడి చేసి పేకాట ఆడుతున్న 19 మంది యువకులను పట్టుకున్నారు. రూ2.19లక్షలు నగదు. ఎనిమిది సెల్‌ఫోన్లు, ఒక కారు, ఆటో, బైక్ స్వాధీన చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

జహీరాబాద్‌లో పట్టుబడిన 16 మంది

జహీరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఆర్యనగర్‌లో వేర్వేరు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై శనివారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆర్యనగర్‌లో ఓ ఇంట్లో 11 మంది, మరో ఇంట్లో ఐదుగురు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేయగా వారివద్ద రూ.64,000 నగదు, పేకముక్కలు లభించాయి. వాటన్నింటిని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసి పోలీసులు కేసు నమోదు చేశారు.





రెడీమిక్స్ వాహనాల నిర్లక్ష్యం



జహీరాబాద్ ప్రాంతంలో రెడీమిక్స్ కేంద్రాల నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా తారు రోడ్లపై ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంది. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న రెడీమిక్స్ వాహనాలు రోడ్లపై ఇష్టారీతిన కంకర, సిమెంట్ మిక్చర్‌ను పడేస్తుండటంతో, అటుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు స్కిడ్ అయ్యి ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం రోడ్లపై పడిన ఈ వ్యర్థాలను తొలగించడంలో మున్సిపల్ అధికారులు శ్రద్ధ చూపడం లేదు. స్థానికులు రెడీమిక్స్ నిర్వాహకులు, అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రెడీమిక్స్ కేంద్రాలకు సరైన అనుమతులు లేకపోవడం, ఓవర్‌లోడ్ వాహనాలపై ఆర్టీఏ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడుతున్నారు.

- జహీరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి)

అక్రమ రవాణాపై కఠిన చర్యలు

ఫటాఫట్

- అంతర్రాష్ట్ర నేరస్థులపై నిఘా
- శాంతిభద్రతల పరిరక్షణకు కృషి
- జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్



జహీరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ స్పష్టం చేశారు. గంజాయి, గుట్కా, రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

డివిజన్ పరిధిలో సీసీ కెమెరాల సంఖ్య ఎంత?

డివిజన్ వ్యాప్తంగా సుమారు 800 సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటిని ప్రధాన కూడళ్లలో, అత్యవసరం ఉన్న ప్రాంతాల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేశాం. నేరాల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. మరో 200 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వ్యాపార సంస్థలు, పరిశ్రమల యజమానులు, ఇళ్ల యజమానులు స్వచ్ఛందంగా కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలేమిటి?

డివిజన్‌లోని ప్రధాన కూడళ్లలో నిత్యం రద్దీగా ఉంటుంది. ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ రాకపోకలకు అంతరాయం కలగకుండా చూస్తున్నాం. జహీరాబాద్ పట్టణం అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో నిత్యం వేల సంఖ్యలో వివిధ అవసరాల నిమిత్తం వస్తుంటారు. ట్రాఫిక్ నియంత్రణకు పట్టణంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు అత్యవసరం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. అదనపు సిబ్బంది అవసరం ఉందని ఉన్నతాధికారులకు తెలిపాం.

శాంతిభద్రతలకు తీసుకుంటున్న చర్యలు?

ఫ్రెండ్లీ పోలిసింగ్‌లో భాగంగా ప్రజలు, నాయకులు, పోలీసుల సహకారంతో పనిచేస్తున్నాం. అనుకోకుండా జరిగే దొంగతనాలు, హత్యలు వంటి సంఘటనల విషయంలో ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.స్థానిక పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదిస్తూ సమస్యలు జటిలం కాకుండా చూస్తున్నాం. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నాం.

అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణకు తీసుకున్న చర్యలేమిటి?

అంతర్రాష్ట్ర నేరస్థులపై నిఘా పెంచాం. జహీరాబాద్ డివిజన్ కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం. జాతీయ రహదారి (ఎన్‌హెచ్65) 60 కిలోమీటర్ల మేర డివిజన్ గుండా వెళ్తున్నది. వివిధ ప్రాంతాలకు చెందిన నేరస్థులు ఇటుగా ప్రయాణిస్తుంటారు. హైవే పెట్రోలింగ్, మఫ్టీలో గస్తీలు, నేరస్థుల కదలికలపై నిఘా ఉంచడం వంటి చర్యలు తీసుకుంటున్నాం. జహీరాబాద్ రూరల్, చిరాగ్‌పల్లి, కోహీర్, హద్నూర్ పోలీస్‌స్టేషన్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. ఈ ప్రాంతంలోని పోలీస్‌స్టేషన్లకు తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కూడా బాధితులు వస్తుంటారు. ముఖ్యంగా దారిదోపిడీలు, దొంగతనాలు, ఆస్తి తగాదాలు, కుటుంబసమస్యలు, సైబర్ మోసాల బాధితులు వస్తుంటారు. ప్రతీ సమస్యను పోలీసులు పరిశీలించి, వివాదాలకు తావివ్వకుండా పరిష్కరిస్తున్నారు.

రాచన్నస్వామి ఆలయంలో కార్తీక శోభ



రాచన్న స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కోహీర్, అక్టోబరు 26: (ఆంధ్రజ్యోతి) కార్తీక మాసం మొదటి ఆదివారం సందర్భంగా కోహీర్ మండలంలోని బడంపేట గ్రామంలోని రాచన్నస్వామి ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం అన్ని పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కలు తీర్చున్నారు. అలాగే భక్తులు అమృత గుండంలో స్నానాలు ఆచరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఏడుపాయల్లో భక్త జనసందోహం



అమ్మవారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

పాపన్నపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గ భవానీమాత సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. అర్చకులు వేకువజామున ఆలయ గర్భగుడిలో అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

స్థానిక సాహిత్యానికి పట్టాభిషేకం



పాఠ్య ప్రణాళిక మండలి సమావేశం (ఫైల్)

సిద్దిపేట డిగ్రీ కళాశాల తెలుగు పాఠ్య ప్రణాళికలో విప్లవాత్మక మార్పులు

అటానమస్ నిబంధనల మేరకు స్థానిక పాఠ్యాంశాల చేరిక

డా.నందిని సిధారెడ్డి, సిద్దెంకి యాదగిరి, ఐతా చంద్రయ్య రచనలు ఎంపిక

కొత్తకొండ చరిత్ర, ఓరుగల్లు సందర్శన పాఠాలు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్) తెలుగు విభాగం చారిత్రక నిర్ణయం తీసుకుంది. దశాబ్దం పాటు స్వయంప్రతిపత్తిని పూర్తి చేసుకున్న నేపథ్యంలో తొలిసారిగా డిగ్రీ తెలుగు పాఠ్యాంశాలలో సమూల మార్పులు చేపట్టింది. పదే పదే పునరావృతమవుతున్న పాత, స్థానికేతర పాఠ్యాంశాల స్థానంలో తెలంగాణ ప్రాంతానికి, ముఖ్యంగా సిద్దిపేట పరిసర ప్రాంతాలకు చెందిన స్థానిక సాహితీ సౌరభానికి పెద్దపీట వేస్తూ కొత్త పాఠ్యప్రణాళికను రూపొందించింది.

ఇప్పటికే పలుమార్లు పునరావృతవుతూ వస్తున్న పాత, స్థానికేతర పాఠ్యాంశాల స్థానంలో కళాశాల తెలుగుశాఖ కొత్త పాఠాలు పెట్టుకున్నది. గతంలో 2023- 24లో పీజీ పాఠ్య ప్రణాళికలో వరకవి సిద్దప్ప పాఠ్యాంశాన్ని చేర్చారు. డిగ్రీలో ఇదే మొదటిసారి. స్వయం ప్రతిపత్తి (అటానమస్) నిబంధనల ప్రకారం 20 నుంచి 30 శాతం మేర పాఠ్యప్రణాళికను మార్పు చేసుకునే అవకాశం ఉన్నందున 25 శాతం పాఠ్య ప్రణాళికను మార్పు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటైన పాఠ్య ప్రణాళిక మండలి ఆధ్వర్యంలో మార్పులు చేర్పులు చేశారు. ఈ పాఠ్యమండలి మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి అధ్యక్షుడిగా, తెలుగు విషయక నిపుణులు చింతకింది కాసీం, కొత్తిరెడ్డి మల్లారెడ్డి, వంగల సంపత్‌రెడ్డి, చిలుముల శ్రీనివాస్, గరిపల్లి అశోక్, పిట్లదాసు, నారోజు వెంకటరమణ సభ్యులుగా ఈ బృందం డిగ్రీ మొదటి సంవత్సరం ద్వితీయభాష, ఆధునిక భాష సబ్జెక్టుల కోసం ఈ పాఠ్య ప్రణాళికను ఆమోదించింది.

పాఠ్యాంశాల మార్పు... న్యాక్ సైకిల్

న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) అంటే కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల నాణ్యత స్థాయిని మూల్యాంకనం చేసే జాతీయ సంస్థ. కళాశాల మొదటిసారి గుర్తింపు పొందినప్పుడు సైకిల్-1గా పరిగణిస్తాం. వరుసగా న్యాక్ గుర్తింపు సాధిస్తే సైకిల్-2, సైకిల్-3 అని సూచిస్తారు. ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒకసారి న్యాక్ గుర్తింపు ఉంటుంది. ఈ మేరకు న్యాక్ సైకిల్-2లో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉంది. ఈ నేపథ్యంలో నిబంధనల ప్రకారం 20 నుండి 30 శాతం మేర పాఠ్యప్రణాళికను మార్పు చేసుకునే అవకాశం ఉన్నందున 25 శాతం పాఠ్యప్రణాళికను మార్పుచేశారు.

చేర్చిన పాఠ్యాంశాలివే..

- డిగ్రీ ద్వితీయ భాష (సెకండ్ లాంగ్వేజ్)తో పాటుగా ప్రత్యేకంగా తెలుగు సబ్జెక్టుగా ఉండే మోడ్రన్ లాంగ్వేజ్ (ఆధునిక భాష)కు సంబంధించిన పాఠ్యాంశాలను మార్పులు చేశారు. ఇందులో భాగంగా గజ్వేలు సమీపంలోని క్షీరసాగరం గ్రామానికి చెందిన రాళ్లబండి రాఘవశాస్త్రి 1950 నాటికే పద్యకావ్యాలు రాసి ప్రచురించిన సాహితీవేత్త. కుగ్రామంలో సొంత ఖర్చులతో ముద్రణాశాలను నడిపించి తెలంగాణ సాహిత్య వికాసానికి బాటలు వేసిన సాహితిమూర్తి. రాఘవశర్మ రచించిన రైతు ఋణవిముక్తి కావ్యం నుంచి 'సేద్య జీవితం' అనేపాఠాన్ని పాఠ్యాంశంగా తీసుకున్నారు.
- భారతదేశంలో విలీనమైన వెంటనే విశాలాంధ్ర కోసం పెనుగులాట మొదలైనప్పుడు దాన్ని వ్యతిరేకించిన కవులలో ఖమ్మం జిల్లా గోకినేపల్లికి చెందిన రావెళ్ల వెంకట రామారావు ఒకరు. తను రాసిన గేయాలలో ధీరులకు మొగసాలరా తెలగాణ అనే దేశభక్తి గీతానికి మలి తెలంగాణ ఉద్యమంలో సిద్దిపేట నుంచే తొలిప్రచారం లభించింది. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని మాతృ గీతిక పేరుతో తెలగాణ గీతాన్ని పాఠ్యాంశంగా చేర్చారు.
- హుస్నాబాదు సమీప ప్రాంతాలకు అతిపెద్ద పుణ్యక్షేత్రం, గొప్ప చారిత్రక స్థలం కొత్తకొండ. ప్రతీ సంక్రాంతికి జరిగే కొత్తకొండ వీరభద్రస్వామి జాతర తెలంగాణలోని ప్రముఖ జాతరలలో ఒకటి. ఈ క్షేత్రంలో తలనీలాల క్షురకుడిగా పనిచేసిన కొత్తకొండవాసి కొలిపాక వీరమల్లు పుల్లయ్య తన జన్మస్థలపు చారిత్రక సాంస్కృతిక విశేషాలను కొత్తకొండ చరిత్ర పేరుతో పుస్తకంగా అచ్చు వేసారు. కొత్తకొండ గ్రామ చారిత్రక ఐతిహ్య విశేషాలను క్రోడీకరిస్తూ అదే పేరుతో పాఠ్యాంశం రూపకల్పన చేశారు.
- వినుకొండ వల్లభరాయని పేరిట శ్రీనాథుడు రాసిన వీధి నాటకం ఆనాటి రాజధాని నగరమైన ఓరుగల్లు నగర సందర్శనం ఇతివృత్తంతో నడుస్తుంది. ఇందులోని ఏకవీర రేణుకామాత గుడులు, బవనీలు, శివసత్తులు, మైలారభటులు, ఓరుగంటిలో పూటకూళ్ల ఇంటిలో ఒక్క రూకకే దొరికే కమ్మటి వరికూడు భోజనం మొదలైన విశేషాలతో కూడిన 15 శతాబ్దపు అచ్చమైన తెలంగాణ సంస్కృతిని చిత్రించే పాఠాన్ని ఓరుగల్లు సందర్శన అనే పేరుతో రూపకల్పన చేశారు.
- తెలుగు కథాకావ్యాలలో తెలంగాణ సామాజిక జీవితాన్ని, బహువిధమైన స్థానికతను విశేషంగా నమోదుజేసిన కావ్యం సింహాసన ద్వాత్రింశిక. ఈ కావ్యకారుడు కొరవి గోపరాజు నిజామాబాదు జిల్లా భీముగల్లు నివాసి. సింహాసన ద్వాత్రింశిక నుంచి గుడ్డేలుగు-పెద్దపులి సంవాదం పాఠంగా తీసుకోబడింది. మనుషులకే కాదు, జంతువులకూ అస్తిత్వం పట్ల తగినంత స్పృహ ఉంటుందనే దృగ్విషయాన్ని ఈ కథ తెలియజేస్తుంది.
- కవిగా, కథకుడుగా, రచయితగా, పరిశోధకుడుగా, ఉద్యమవేత్తగా ఆధునిక తెలుగు భాషాసాహిత్యాలలో డా.నందిని సిధారెడ్డిది ప్రముఖమైన ముద్ర. తన సంభాషణ కవితా సంపుటి నుంచి కొంగలు అనే వచన కవితను పాఠ్యాంశంగా స్వీకరించారు. సహజ వనరుల విధ్వంసం నేపథ్యంలో పర్యావరణ మానవీయ స్పృహలను యువతలో పునరుత్తేజం చేయటం కోసం ఈపాఠం ఎంపికైంది.
- సిద్దిపేట ప్రాంతంలో ఐతా చంద్రయ్య సీనియర్ కథకుడు. పలు ప్రక్రియలలో బహు గ్రంథకర్త. ఆరు వందలపైచిలుకు కథలు రాసి ఇరువైమూడు కథా సంపుటాలు ప్రచురించారు. వీరి సాహితీ కృషిని నేటి విద్యార్థులకు గుర్తింపజేస్తూ మంచు ముద్ద కథను పాఠ్యాంశంగా పెట్టారు. ఈ కథను కేంద్ర సాహిత్య అకాడమీ పలు భారతీయ భాషలలోకి అనువాదం చేసింది.
- సిద్దిపేట ప్రాంతానికి చెందిన వర్తమాన కథకుడు, పరిశోధకుడు, విమర్శకుడు, పుస్తక ముద్రకుడు సిద్దెంకి యాదగిరి రాసిన నిలువెత్తు దుఃఖం ఇటీవలి ప్రాజెక్టుల నిర్మాణాల వలన ఛిద్రమైన ముంపు గ్రామాల వెతలను చిత్రించిన కథ. మల్లన్నసాగర్‌లో మునిగిన వేములఘాట్ పాఠశాల ఉపాధ్యాయుడుగా తాను చూసిన గాథలను కథగా మలిచినందున ఈ కథ అదే పేరుతో పాఠ్యాంశంగా చేర్చారు.
- ఇవేగాక తెలంగాణ ప్రాంతానికి చెందిన తొలితరం విమర్శకులు కోవెల సంపత్ కుమారాచార్య, బిరుదురాజు రామరాజు, పాకాల యశోదారెడ్డి పరిచయాలను తీసుకున్నారు.

మన సాంస్కృతిక వారసత్వాన్ని విద్యార్థులు తెలుసుకోవాలి

దాదాపు 20 రోజుల పాటు విస్తృత చర్చల అనంతరం అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని స్థానికతకు పట్టం కడుతూ ఈ పాఠ్యాంశాలను చేర్చాం. స్థానికతను, మన సాంస్కృతిక వారసత్వాన్ని విద్యార్థులు తెలుసుకోవాలి. ఈ పాఠ్యాంశాల అభ్యసనం ద్వారా డిగ్రీ స్థాయి విద్యార్థులలో ఉత్తమ వ్యక్తిత్వ విలువలు, భాషా సాంస్కృతిక అంశాలపట్ల సముచిత అభిరుచులు పెరుగుతాయి

- డా.మట్టా సంపత్ కుమార్‌రెడ్డి, పాఠ్య ప్రణాళిక మండలి అధ్యక్షుడు



భారతీయ సాంస్కృతిక విలువలను తరతరాలకు అందించాలి

- సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు

గజ్వేల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సాంస్కృతిక విలువలను తరతరాలకు అందించాలని సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో సంచార జాతుల కళా ప్రదర్శనలు కార్యక్రమాన్ని సామాజిక సమరసతా వేదిక, విముక్త సంచార జాతుల అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక సమరసతా వేదిక ప్రాంత కన్వీనర్ అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ.. భారతీయ విలువలు, సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వివిధ వర్గాలకు, ఆశ్రిత కులాలకు కుల చరిత్రలు చెప్పే జీవనం గడిపే విముక్త సంచాల జాతుల కళలు సమాజ చైతన్యానికి ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో వారి కృషి ఎనలేనిదని, ప్రజలను జాగృతం చేస్తూ స్వావలంబన, సంస్కృతి, ఆత్మగౌరవం కోసం ప్రజలు నిలబడేలా చేయడంలో వారి పాత్రను కొనియాడారు. 32 సంచార జాతుల కళా ప్రదర్శనలు చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయని తెలిపారు. వారితో విముక్త సంచార జాతుల అభివృద్ధి మండలి ప్రధాన కార్యదర్శి చిరంజీవి, రుక్మిణి, మంద సాయినాథ్‌రెడ్డి, నాగేందర్, శ్రీధర్ తదితరులున్నారు.



సంచార జాతుల కళా ప్రదర్శనలో ఆవిష్కరిస్తున్న పోస్టర్

ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏలు నవంబర్ నెలలో ప్రకటించి అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులు ప్రతీ నెల రూ.700 కోట్లు విడుదల చేసి ఉద్యోగుల ఖాతాలో జమ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 57 రూల్స్ అనుగుణంగా హైకోర్టు తీర్పు మేరకు డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఉపాధ్యాయుల సర్దుబాటు నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

అడ్డాపై ఆకలి పోరాటం

తూప్రాన్‌లో వందలాది కూలీలు... పని దొరకక పడిగాపులు

ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు నిరీక్షణ

తక్కువ కూలీకి యూపీ, బీహార్ కార్మికులు సిద్ధం

స్థానికులకు కష్టంగా మారిన పనులు



తూప్రాన్ పట్టణంలో పనుల కోసం నిరీక్షిస్తున్న కూలీలు

తూప్రాన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బతుకు బండిని నడపడానికి, పూట గడవడానికి కూలి పనులు దొరకడం స్థానిక కార్మికులకు గగనంగా మారింది. ఒక్క పని కోసం వందలాది మంది అడ్డా కూలీలు ప్రతీ రోజు నిరాశతో పడిగాపులు కాస్తున్నారు. పని దొరకక ఇంటికి వెళ్లడం అంటే ఆ రోజు పస్తులుండక తప్పదు అనే పరిస్థితి మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో కనిపిస్తోంది.

తెల్లవారుజామునే అడ్డా వద్దకు..

తూప్రాన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న పాత హైవే రోడ్డు కూలీల అడ్డాగా మారింది. శివ్వంపేట, వెల్దుర్తి, మాసాయిపేట, చేగుంట, చిన్నశంకరంపేట, సిద్దిపేట జిల్లాకు చెందిన రాయపోలు, దౌల్తాబాద్, వర్గల్ వంటి పలు మండలాల నుంచి నిత్యం సుమారు 400 నుంచి 500 మందికి పైగా కూలీలు తెల్లవారుజామున 6 గంటలకే సద్దిమూటలు కట్టుకొని ఇక్కడికి చేరుకుంటున్నారు. ఎవరైనా యజమానులు వచ్చి తమను పనులకు తీసుకెళ్తారా అని మధ్యాహ్నం వరకు ఎదురుచూస్తుంటారు. గృహ నిర్మాణ పనులు మొదలుకుని ఏ పని అయినా చేసేందుకు సిద్ధంగా ఉంటారు. ఆరోజు పని దొరికితే ఆనందం, లేకుంటే నిరాశే మిగులుతోంది.

ఉపాధి హామీలో తక్కువ కూలి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కూలీలకు గరిష్ఠంగా రూ.300 వరకు మాత్రమే కూలి లభిస్తోంది. ఈ తక్కువ కూలి డబ్బుతో, అదీ సమయానికి అందక బతుకు వెల్లదీయడానికి సరిపోకపోవడంతో, కూలీలు అధిక డబ్బులు వచ్చే ఇతర పనుల కోసం మొగ్గు చూపుతున్నారు. అయితే, అక్కడ కూడా పనులు దొరకడం గగనమై నిత్యం పనుల వేటలో నిరీక్షించాల్సి వస్తోంది.

యూపీ, బీహార్ కూలీల పోటీ

అసలే కూలీ బతుకులు అంటే అందులోనూ ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు పోటీపడుతుండడంతో స్థానిక కూలీలకు పని దొరకక జీవితాలు కష్టాల సుడిగుండంలో నెట్టబడుతున్నాయి. గతంలో హైదరాబాద్ వంటి నగరాలకే పరిమితమైన ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు సైతం చేరుకున్నారు. అతి తక్కువ కూలి డబ్బుకే పనులు చేయడానికి వీరు సిద్ధపడటంతో, యజమానులు వీరి వైపే మొగ్గు చూపుతున్నారు. అంతేకాక, శ్రమ అధికంగా ఉండే పనులను కూడా వీరు చేస్తారనే భావనతో వారిని పనులకు పిలుస్తున్నారు. ఫలితంగా, స్థానికంగా పనులు దొరకని కూలీలు, ఇప్పుడు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.



పనులు వెతుకుంటున్నాం

కూలీ పనులు లభించకపోవడంతో వెతుకుంటూ దూరంగా ఉన్నా వెళుతున్నాం. పనుల కోసం రోజంతా పడిగాపులు గాస్తున్నాం. పనులు దొరకకపోతే డబ్బు లేక ఒక్కో రోజు ఉపవాసం ఉంటున్నాం. ప్రభుత్వం కూలీలను ఆదుకోడానికి పథకాలు అమలు చేయాలి. వర్షాల కారణంగా వ్యవసాయ పనులు తగ్గిపోయాయి. కూలీలకు పనులు పనులు కల్పించాలి.

- యాదగిరి, రామాంతపూర్, మాసాయిపేట మండలం



ఇతర కూలీలతో ఇబ్బందులు

కూలి పనులు చేసేందుకు ఇతర రాష్ట్రాల ప్రజలు రావడంతో పనులు దొరకడం కష్టంగా మారింది. ఊర్లలోనూ వారే పనులు చేస్తున్నారు. గ్రామాల్లోనూ మమ్మల్ని పిలువడంలేదు. పనులు వెతుక్కుంటూ ఎంత దూరమైన వెళ్తున్నాం. జంగరాయి నుంచి తూప్రాన్‌కు దూరంగా ఉన్న పనుల కోసం వస్తు కూలి పనుల కోసం నిరీక్షిస్తున్నాం. స్థానికులకు పనులు కల్పిస్తే ఇబ్బందులు తీరుతాయి.

- మంగమ్మ, జంగరాయి, చిన్నశంకరంపేట మండలం

సైక్లింగ్‌తో ఉజ్వల భవిష్యత్తు

- డీవైఎస్‌వో జంగపల్లి వెంకట నర్సయ్య

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నిత్యం సైకిల్ సాధన చేసినట్లయితే వాతావరణ కాలుష్య నివారణతో పాటు, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, అంతేకాకుండా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి(డీవైఎస్‌వో) జంగపల్లి వెంకటనరసయ్య అన్నారు. ఆదివారం సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో నిర్వహించిన 20 జిల్లాస్థాయి సైకిల్ పోటీలను రూరల్ సీఐ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో మాట్లాడుతూ నిత్యం సైకిల్ సాధన చేయడం వలన అనేక లాభాలు ఉంటాయని వారు పేర్కొన్నారు. సైక్లింగ్ బాల్యం నుంచే అభ్యసిస్తే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. సైకిల్ తొక్కినట్లయితే శారీరక సౌష్టవంతో పాటు, మానసిక ఎదుగుదల లభిస్తుందన్నారు. ఈ సైక్లింగ్ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఎంపికలు నిర్వహించి ప్రతిభావంతులైన వారిని ఈనెల 31, వచ్చే నెల ఒకటి రెండు తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసులు, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రభ, పాఠశాల క్రీడా సమాఖ్య మాజీ కార్యదర్శి పాతూరి సుజాత, క్రీడా సంఘాల కార్యదర్శులు ఉప్పలయ్య, ఖేల్ ఇండియా సైక్లింగ్ కోచ్ సంజీవ్, సీనియర్ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



సైక్లింగ్‌ను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో జంగపల్లి వెంకటనరసయ్య, సీఐ శ్రీనివాస్

పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

- సీఐటీయూ జిల్లా కోశాధికారి రాజయ్య

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 26 : కార్మిక చట్టాలను అమలు చేయని జిన్నారం మండలం కాజిపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని శ్రీరాం క్లోరో పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి రాజయ్య ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగులు, కార్మికుల అక్రమ బదిలీలు, సస్పెండ్లు, టర్మినేషన్‌లను వెంటనే ఎత్తివేయాలన్నారు. లేనిపక్షంలో కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

న్యూస్ బాక్స్

ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపత్రులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో వరుసగా సంఘటనలు జరుగుతున్నప్పటికీ, అధికారులు తమ కేమీ పట్టనట్లు వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఇప్పటికే జిల్లాలో 17 ప్రైవేటు ఆసుపత్రులకు జరిమానా విధించారని, 25 మంది నకిలీ వైద్యులను ఐఎంఏ గుర్తించినా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించకపోతే, పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. సీపీఎం నాయకులు మాణిక్యం, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వసతి కల్పించిన ఎన్నారై చంద్రశేఖర్

చిన్నశంకరంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బుడగ జంగాల కాలనీలో గత కొన్ని రోజులుగా నీటి కొరత ఏర్పడడంతో, గ్రామానికి చెందిన ఎన్నారై, ప్రజా సేవకుడు కంజర్ల చంద్రశేఖర్ స్పందించారు. ఆదివారం ఆయన తన సొంత ఖర్చులతో పాత బోరు బావికి మరమ్మతులు చేయించి, నీటి వసతి కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని, ఏ సమస్య వచ్చినా తీర్చేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

ఉజ్వల యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అల్లాదుర్గం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ గ్యాస్ కనెక్షన్లు అందించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఉజ్వల యోజన పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ అల్లాదుర్గం మండల అధ్యక్షుడు జిన్న భాస్కర్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పొగపొయ్యిలతో ప్రజలు అనారోగ్యపాలవుతున్నారనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఉజ్వల పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందిస్తుందని వివరించారు. రేషన్‌కార్డు కలిగి ఉండి, ఆ రేషన్‌కార్డుపై గ్యాస్ కనెక్షన్ పొందని వినియోగదారులు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన రేషన్‌కార్డు వినియోగదారులు అందుబాటులో ఉన్న గ్యాస్ ఏజెన్సీలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు కాళ్ల రాములు, నీటి రమేశ్, కృష్ణ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్ డీసీసీ మేనేజర్‌కు ఏజీఎంగా పదోన్నతి



వెంకటేశం

నారాయణఖేడ్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్న వెంకటేశంకు ఏజీఎంగా పదోన్నతి కల్పిస్తూ బ్యాంకు సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటేశం స్థానంలో పాపన్నపేట మేనేజర్‌గా పనిచేస్తున్న కిషన్‌ను నియమించారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

వెల్దుర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి గౌరీ కోరారు. ఆదివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో సీఐటీయూ నాయకులు మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ మహాసభలు డిసెంబరు 7నుంచి 9 వరకు మెదక్‌లో జరుగుతాయని, అన్ని రంగాల కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్, సత్యం, బాబు, బ్రహ్మం, కుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

'మన్ కీ బాత్'ను వీక్షించిన బీజేపీ నాయకులు

నర్సాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం నిర్వహించిన 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేశ్‌గౌడ్ తదితరులు వీక్షించారు. వీరితో పాటు స్థానిక నాయకులు బాలరాజు, గుండం శంకర్, చంద్రయ్య, నగేష్, రాజు, రాంరెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మించిన దాత

నారాయణఖేడ్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బోరంచ నల్ల పోచమ్మ ఆలయం రాజగోపురం ముందు భక్తుల సౌకర్యం కోసం ఆందోల్ మండలం తాడ్మనూరుకు చెందిన బోయిని లక్ష్మి, నర్సింహులు దంపతులు రూ.1,18,800లతో షెడ్డును నిర్మింపజేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ బెల్లాపూర్ మల్లయ్య, ఆలయ అర్చకులు సిద్దయ్యస్వామి, శ్రీకాంత్‌స్వామి, నగేష్ స్వామి, ప్రవీణ్‌స్వామి, సిబ్బంది శేఖర్ తదితరులు దాతలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ తదితరులు దాతలను సన్మానించారు.

జిన్నారంలో జాతీయ బ్యాంకులేవి?

- వందల పరిశ్రమలు, వేల మంది ఖాతాదారుల ఆర్థిక లావాదేవీలకు టీజీబీ ఒక్కటే దిక్కు
- కార్మికులు, వ్యాపారులకు ఇక్కట్లు
- ఎస్‌బీఐ బ్రాంచ్‌కు సర్వే చేసి.. ఏటీఎంతో సరిపెట్టిన అధికారులు
- అది సైతం నిత్యం మూతే
- పారిశ్రామిక వాడల టర్నోవర్ కోట్లల్లో ఉన్నా.. ఏర్పాటు చేయని బ్యాంకులు



జిన్నారంలోని టీజీబీ బ్యాంకు



నెల రోజులుగా పని చేయని ఎస్‌బీఐ ఏటీఎం

జిన్నారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందిన జిన్నారం మండలంలో జాతీయ బ్యాంకు సేవలు అందుబాటులో లేక పారిశ్రామికవేత్తలు, కార్మికులు, వ్యాపారులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వందల పరిశ్రమలు, భారీ ఆర్థిక లావాదేవీలు ఉన్నప్పటికీ, మండలంలోని 15 గ్రామాలకు చెందిన సుమారు 12 వేల మంది ఖాతాదారులకు ఒక్క జాతీయ బ్యాంకు బ్రాంచీ కూడా అందుబాటులో లేదు. ఉన్న ఒక్క గ్రామీణ బ్యాంకు సేవలు కూడా పరిమితంగా ఉండడంతో వేలాది మందికి నిత్యం ఇక్కట్లు తప్పడం లేదు.

గ్రామీణ బ్యాంకులో పరిమిత సేవలు

మండల కేంద్రం జిన్నారంలో మూడు దశాబ్దాలుగా ఏపీజీవీబీ (ప్రస్తుతం టీజీబీ) శాఖ మాత్రమే ఉంది. మండలంలోని 15 గ్రామాలకు చెందిన సుమారు 12 వేలకు పైగా సాధారణ ఖాతాదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, పరిశ్రమల కార్మికులు, వివిధ రంగాల వ్యాపారులు ఇందులో ఖాతాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా భారీ సంఖ్యలో మహిళా సంఘాల ఖాతాలు కూడా ఈ బ్యాంకులోనే ఉన్నాయి. అయితే, ఈ గ్రామీణ బ్యాంకులో జాతీయ బ్యాంకుల స్థాయిలో సేవలు అందడం లేదు. డిపాజిట్ చేసిన వారు డబ్బులు తీసుకోవడంలో పరిమితులు, ఇతర బ్యాంకుల చెక్కుల క్లియరెన్స్‌కు మూడు రోజుల సమయం, కొంత రుసుము చెల్లించాల్సి రావడం, ఆన్‌లైన్ సౌకర్యాలలో పరిమితులు వంటి సమస్యలు ఉన్నాయి. కొన్ని డీడీలు కేవలం జాతీయ బ్యాంకుల నుంచి తీసుకుంటేనే చెల్లుబాటు కావడం, రుణాల మంజూరీలో వడ్డీ రేట్లలో తేడాలు వంటి ఇబ్బందులు ఖాతాదారులను వేధిస్తున్నాయి.

'ఎనీ టైం మూత'

మూడేళ్ల క్రితం జిన్నారంలో ఎస్‌బీఐ బ్యాంకు శాఖ ఏర్పాటు కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చారు. అధికారులు సర్వే కూడా నిర్వహించి చివరకు ఓ ఏటీఎం ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. అయితే, ఆ ఏటీఎం కూడా నిత్యం పనిచేయక వినియోగదారులు నిరాశ చెందుతున్నారు. నగదు లేకపోవడం, సర్వర్ పనిచేయకపోవడం వంటి కారణాలతోఈ ఏటీఎం 'ఎనీ టైం మూత'బడి ఉంటుందని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

20 కి.మీ ప్రయాణం..

జిన్నారం పారిశ్రామిక వాడతో పాటు కాజీపల్లి, గడ్డపోతారం పరిధిలో 85 వరకు, జిన్నారం, శివానగర్, కొడకంచిలో మరో 30 వరకు పరిశ్రమలు ఉన్నాయి. ఈ పారిశ్రామిక వాడల్లో నిత్యం కోట్ల రూపాయల టర్నోవర్ జరుగుతుంది. స్థానికంగా జాతీయ బ్యాంకులు లేకపోవడంతో పరిశ్రమల కార్మికులు, యాజమాన్యాలు తమ వ్యాపార నిర్వహణ ఖాతాలను సమీపంలోని మేడ్చల్ జిల్లాలోని గండిమైసమ్మ, నగరంలోని షాపూర్‌నగర్, బాలానగర్ ప్రాంతాలలో నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెక్కులు, నగదు కోసం కార్మికులు, వ్యాపారులు నిత్యం 15 నుంచి 20 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో జిన్నారంలో వెంటనే జాతీయ బ్యాంకులను ఏర్పాటు చేయాలని ప్రజలు, పారిశ్రామికవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.



మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

'పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి'

టేక్మాల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రమైన టేక్మాల్‌లో 5 కిలోమీటర్ల మార్నింగ్ వాక్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు నివాళులు అర్పించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ... 1959లో భారత-చైనా సరిహద్దులో విధి నిర్వహణలో అమరులైన భారతీయ పోలీసులను స్మరించుకుంటూ, దానికి గుర్తుగా ప్రతి ఏటా అక్టోబరు 21న పోలీస్ అమరవీరుల దినోత్సవం నిర్వహించుకుంటామని తెలిపారు. అమరులైన పోలీసుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టేక్మాల్ ఎస్‌ఐ రాజేష్, సర్కిల్ ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు అన్నదానం



అనంతపురం జిల్లా రాప్తాడుంలో స్వాములకు అన్నదానం చేస్తున్న దృశ్యం

పటాన్‌చెరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు నియోజకవర్గం రామచంద్రాపురం బెల్ అయ్యప్పస్వామి ఆలయం నుంచి శబరిమలకు మణికంఠ అయ్యప్పస్వామి భక్తులు పాదయాత్ర ప్రారంభించారు. మార్గమధ్యలో అనంతపురం జిల్లా రాప్తాడు గ్రామంలో భక్తులు విడిది చేశారు. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు, అన్నదానం, వసతి సౌకర్యాలు నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు సాయిచరణ్ గౌడ్, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్ కల్పించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మాజీ అధ్యక్షుడు సుభాష్‌రెడ్డి

పుల్కల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని ఎంపీపీ మాజీ అధ్యక్షుడు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి అన్నారు. చౌటకూరు మండలం చక్రియాల గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరథలతో కలిసి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భానురి లక్ష్మయ్య, నాయకులు రాములు, కలాలి ఈశ్వర్‌గౌడ్, మల్లికార్జునగౌడ్, రాజశేఖర్, విష్ణువర్ధన్ రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, తుంగె పండరి తదితరులు పాల్గొన్నారు.

కంకోల్-కప్పాడ్ రోడ్డు పనులు ప్రారంభం



కొనసాగుతున్న బీటీ రోడ్డు పనులు

మునిపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంకోల్-కప్పాడ్ రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మండలంలోని మన్సన్‌పల్లి గ్రామ చౌరస్తా నుంచి రాయికోడ్ మండలం సింగితం వరకు రోడ్డు పనులు ఆదివారం మొదలై కొనసాగుతున్నాయి. కాగా, కంకోల్ నుంచి మన్సన్‌పల్లి గ్రామం వరకు రోడ్డు గుంతలమయంగా ఉన్నప్పటికీ, ఆ ప్రాంతాన్ని విడిచిపెట్టి మన్సన్‌పల్లి నుంచి సింగితం వరకు రోడ్డు పనులు చేపట్టడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కంకోల్ నుంచి కప్పాడ్ రోడ్డు మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుని పనులను కొనసాగించాలని పలువురు కోరుతున్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థులకు ఘన సన్మానం



హైదరాబాద్‌లో ఎంబీబీఎస్ విద్యార్థులను సన్మానిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్,హరీశ్‌రావు

జహీరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని బూచనెల్లి, అల్గోల్ మైనారిటీ గురుకుల కళాశాలల్లో చదివి ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన 16 మంది విద్యార్థులను ఆదివారం హైదరాబాద్‌లో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ హయాంలో జహీరాబాద్‌లో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ' కళాశాలలు ఏర్పాటు చేశామన్నారు. కేవలం జహీరాబాద్ నుంచే 16 మంది విద్యార్థులు ఎంబీబీఎస్‌లో ఉచితంగా సీట్లు సాధించడం గర్వకారణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎందరో డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు ఇలా అనేక వృత్తుల్లో ప్రవేశించారంటే అది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత వల్లేనని వారు స్పష్టం చేశారు. ప్రభుత్వ సహకారంతో డాక్టర్లుగా మారిన మీరంతా ఇతరులకు సహాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు ఒక్కొక్కరు వారి వారి అనుభవాలు చెబుతుంటే అందరి కళ్లలో ఆనందబాష్పాలు కనిపించాయన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నీటి కోసం రోడ్డెక్కిన ప్రజలు

నారాయణఖేడ్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మన్సూర్‌పూర్ వార్డు వాసులు నీటి కోసం ఆదివారం రోడ్డెక్కి ఆందోళన చేశారు. తమ వార్డులో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. దీంతో ఆందోళన చేయాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మన్సూర్‌పూర్‌లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

అపోలో ట్యూబ్స్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు



సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న కార్మిక సంఘాలు

చేగుంట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పర్మినెంట్ ఉద్యోగుల అక్రమ బదిలీలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అపోలో ట్యూబ్స్ పరిశ్రమ ఉద్యోగుల సమ్మె 20వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు ఆదివారం వివిధ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. తెలంగాణ లీగల్ సెల్ అడ్వైజర్ రాజిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి, జిల్లా సంఘటన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా బీఎంఎస్ అధ్యక్షులు నరసింహారెడ్డిలు పర్మినెంట్ ఉద్యోగుల అక్రమ బదిలీలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

వైద్యశాఖలో పైసావసూల్..

(5వ పేజీ తరువాయి)

పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా కల్హేర్ సీహెచ్‌సీ నుంచి ఐదుగురు స్టాఫ్ నర్సులను జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి డిప్యూటేషన్ ఇచ్చి మూడు రోజుల్లో రద్దు చేసినట్టు తెలిసింది. అలాగే పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రి నుంచి ఓ డాక్టర్‌ను జహీరాబాద్‌కు డిప్యూటేషన్ ఇవ్వగా, మరో డాక్టర్‌ను నారాయణఖేడ్‌కు డిప్యూటేషన్ ఇచ్చి క్యాన్సర్ చేశారు. ఇవన్నీ కూడా అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్‌పై వర్క్ ఆర్డర్ బేస్డ్‌లో డీసీహెచ్‌ఎస్ ఉత్తర్వులు వెలువరించారు. ఇవేకాకుండా గతంలోనూ పెద్ద ఎత్తున్న డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది, ఉద్యోగులను డిప్యూటేషన్‌పై బదిలీ చేసినట్టు తెలిసింది. ఈ వ్యవహారంలో లక్షల్లో చేతులు మారాయనే ప్రచారం జరుగుతున్నది.

కలెక్టర్ ఆమోదం లేకుండానే..

ఏడాదిన్నర కిందట రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో డిప్యూటేషన్లన్నీ ప్రభుత్వం రద్దు చేసింది. అవసరమైతే జిల్లా కలెక్టర్ అనుమతి పొంది డిప్యూటేషన్ ఇవ్వాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. కానీ అవేమీ నిబంధనలు పాటించకుండా ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా టీవీవీపీ అధికారులు కొద్ది నెలలుగా పెద్ద ఎత్తున డిప్యూటేషన్ల దందాకు తెరలేపడం పలు విమర్శలకు తావిస్తున్నది.

మంత్రి, కలెక్టర్ వద్దకు పంచాయితీ

సంగారెడ్డి జిల్లాలోని టీవీవీపీ పరిధిలో జరుగుతున్న బలవంతపు డిప్యూటేషన్ల వ్యవహారంతో తీవ్రఇబ్బందులు పడుతున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఉద్యోగులు జిల్లా అధికారి తీరుపై మండిపడుతున్నారు. ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు బాధితులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

సేవలకు ఆటంకం కలగొద్దనే

టీవీవీపీ పరిధిలోని ఏరియా, కమ్యూనిటీ ఆస్పత్రుల్లో వైద్య సేవలకు ఆటంకం కలగొద్దని అవసరం మేరకు కొందరు వైద్య సిబ్బంది, ఉద్యోగులను డిప్యూటేషన్‌పై నియమించాం. బలవంతంగా డిప్యూటేషన్ల పేరిట డబ్బులు వసూలు చేస్తున్నట్టు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు.

-షేక్ మహ్మద్ షరీఫ్, డీసీహెచ్‌ఎస్, సంగారెడ్డి జిల్లా

న్యూస్ బాక్స్

ఉత్సవాలను జయప్రదం చేయండి

నారాయణఖేడ్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని బసవ కల్యాణ్‌లో నవంబరు 29, 30 తేదీల్లో నిర్వహించనున్న అనుభవ మంటప ఉత్సవాలను భక్తులు జయప్రదం చేయాలని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త మహాలింగ స్వామి కోరారు. ఆదివారం ఖేడ్ పట్టణంలోని బసవ మంటపంలో భక్తులతో కలిసి ఆయన ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేడుకలకు కర్ణాటక రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి తదితర ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత సమాజం నాయకులు శంకర్‌పటేల్, సంగేశెట్టి, శివకుమార్‌పాటిల్, ప్రతాప్, అశోక్, రాజు, రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

'అమలుకు నోచని కాంగ్రెస్ హామీలు'

మెదక్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కావొస్తున్నా ఇచ్చిన 420 హామీలలో ఏ ఒక్కటీ పూర్తిగా అమలు కాలేదని బీఆర్‌ఎస్‌వీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి బజార్ రంజిత్ గౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్ (కే) గ్రామంలో ఆదివారం ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ పథకాలే ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో రోజులు గడుపుతోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ భారీ మెజార్టీ సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దయాకర్, ధర్మారెడ్డి, ఎల్లం, పెంటయ్య, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

'ఓట్ చోరీ'పై అవగాహన

జహీరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం ఓట్ చోరీకి పాల్పడి అధికారంలో కొనసాగుతోందని పలువురు కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఆదివారం జహీరాబాద్ మండలంలోని కొత్తూర్ (బి), అల్గోల్, శేఖాపూర్ తాండ, దిడిగి, బూచ్చిపాడ్ తదితర గ్రామాల్లో ఓట్ చోరీ జరిగిన విధానం తదితరాలపై గ్రామాల్లో ప్రజలకు నాయకులు అవగాహన కల్పించి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికలముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తుందని తెలిపారు. ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా కాంగ్రెస్ తపిస్తుందని వారు గుర్తు చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు మోతీరాం, రవీందర్, దిలీప్‌కుమార్, హన్మంతరెడ్డి, ముబిన, జగన్, శంకర్‌పవార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గాడియం స్కూల్‌లో జరిగిన జిమ్నాస్టిక్ ఎంపికల్లో సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో విగ్నేష్, రాహుల్, వరుణానాయక్, అశ్వినికుమార్, జశ్వంత్, స్టీఫన్‌లు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సోలోమోన్‌రెడ్డి, డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అరుణరెడ్డి, కోచ్ విఠల్ అభినందించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వెల్దుర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన స్నేహితుడి కుటుంబానికి ఆదివారం తోటి స్నేహితులు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. మండల కేంద్రమైన వెల్దుర్తికి చెందిన మేడ్చల్మె నాగరాజు ఈ నెల 18న ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకుని మృతి చెందాడు. అతనికి భార్య, ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. 2007-08 సంవత్సరంలో నాగరాజుతో పాటు పదవ తరగతి చదువుకున్న స్నేహితులు రూ.18 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, మహేశ్, శేఖర్, కుమార్, నరేశ్ తదితరులు ఉన్నారు.

లక్కు చిక్కేనా..

(5వ పేజీ తరువాయి)

ఉన్నవారూ తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సొంతగా దరఖాస్తు చేసుకున్నారు. అలాంటి వారు లక్కీడ్రాలో మద్యం దుకాణం వస్తే గుడ్‌విల్ తీసుకొని ఇతరులకు అప్పగించాలనే ఆశతో ఉన్నారు. ఒక్కో షాపుకు రూ.కోటి వరకు గుడ్‌విల్ ఇచ్చేందుకు సిండికేట్లు సిద్ధమవుతుండటం గమనార్హం. దీంతో, రెండేళ్లపాటు పెట్టుబడిపెట్టి షాపు నడపడం కంటే గుడ్‌విల్ తీసుకొని అమ్ముకోవడం బెస్ట్ అంటూ కొందరు ఆశావహులు భావిస్తున్నారు.